# తత్వాలూ - మనస్తత్వాలూ

అమెరికా గురించీ, అమెరికాలో ప్రజల జీవన విధానం గురించీ కబుర్లు చెప్పుకుందాం అనుకున్నాం కదా. మొదటి దాంట్లో అమెరికా దేశం గురించీ, రెండవ దాంట్లో వారి ఆర్థిక విధానం గురించీ చెప్పుకున్నాం. ఇప్పుడు అమెరికాలోని సామాన్య ప్రజల మనస్తత్వాల గురించి చెప్పుకుందాం.

ఒకప్పుడు అంటే యాభై ఏళ్ళ క్రితందాకా తెల్లవాళ్ళ ఆధిక్యం, నల్లవాళ్ళని తొక్కివేయటం ఎక్కువగా వుండేది. నల్లవాళ్ళనే కాదు, తెల్లవాళ్ళు కానివాళ్ళందరినీ. యూరప్‌నించీ వచ్చిన బ్రిటిష్ ఫ్రాన్స్ జర్మనీ మొదలైన దేశాల వారు,వాళ్ళ దేశాలనించీ అమెరికాకి తెచ్చిన అంటురోగం అది. సాటి మనుష్యుల్ని అంటరాని వాళ్ళగా చూసే అమానుష రోగం. ఆఫ్రికానించీ బానిసలుగా తెచ్చుకున్న నల్లవాళ్ళని, బస్సుల్లో దూరంగా ఒక పక్కగా కూర్చోబెట్టటం, అన్నిచోట్లా వాళ్ళకి వేరే టాయిలెట్లు. కొన్ని హోటళ్ళలో వాళ్ళకి ప్రవేశం లేకపోవటం, సమానంగా చదువుకునే అవకాశం లేకపోవటం.. ఇలా చాల జరిగాయి. ఇలా జరుగుతున్న అకృత్యాలని నల్లవాళ్ళే కాక కొంతమంది తెల్లవాళ్ళు కూడా నిరసించటం, మార్టిన్ లూథర్ కింగ్, రాబర్ట్ కెన్నెడీతో సహా ఎంతోమంది ఆ పోరాటంలోఆహుతి అయిపోవటం తర్వాత ఎన్నో సంస్కరణలు వచ్చి సమాన అవకాశాలు రావటం జరిగాయి.

1967లో మా సుబ్బారావుగారు ఆస్టిన్‌నించీ హ్యూస్టన్‌కి, డ్రైవ్ చేసుకుంటూ వెడుతూ దారిలో ఒక చిన్న పల్లెటూర్లో, కారులో పెట్రోల్ పోయించుకుందామని ఆగారుట. ఆయన్ని బయటే నుంచోబెట్టి పెట్రోలు ఇచ్చారుట కానీ, లోపల టాయిలెట్ మీకు కాదు తెల్లవాళ్ళకి మాత్రమే అని చెప్పారు. అలాగే కాఫీ కూడా ఆయనకి అమ్మమని చెప్పారుట. అది ఆ నాటి మాట. ఈనాడు అమెరికా అవకాశాల దేశం అనుకున్నాం కదా. ఎంతోమంది విదేశీయులు, భారతీయులతో సహా, చేతుల్లో రెండు సూట్‌కేసులతో ఈదేశంలో అడుగుపెట్టినవారే. కొంతమందికి డిగ్రీలున్నాయి, కొంతమందికి అవీ లేవు. పై చదువులకోసం వచ్చినా, రీసెర్చి కోసం వచ్చినా, అవకాశాలు వెతుక్కుంటూ వచ్చినా, వచ్చిన వాళ్ళల్లో అధిక భాగం అనుకున్నవి సాధించారు. అలా వచ్చిన భారతీయుల్లో చాలమంది ఆర్థికంగా నిలదొక్కుకుంటే, కొంతమంది మిలియనీర్లూ, బిలియనీర్లూ అయారు. ఏభై ఏళ్ళలో వచ్చిన ఈ తేడాను చూస్తుంటే ఆశ్చర్యంవేస్తుంది.

ఆశ్చర్యం వేసే ఇంకొక విషయం ఏమిటంటే, వేరే దేశాల నుంచి వచ్చినా త్వరలోనే అమెరికా పౌరసత్వంతోబాటూ ఈ దేశంలోనే ఒక భాగమయిపోవటం, దేశం మీద అభిమానం, దేశమంటే ఒక విధమైన గర్వం ఏర్పరుచుకోవటం కనిపిస్తూనేవుంటుంది. కెన్నెడీ చెప్పినట్టు నీదేశం నీకేమిచ్చింది అని కాదు ప్రశ్న. నీ దేశానికి నువ్వేమిచ్చావని. అలా అని ప్రభుత్వ విధానాలని సమర్థిస్తారని కాదు. ఇతర దేశాలతో యుద్ధాలని సమర్థించే వారితోపాటూ నిరసించే వారూ చాల ఎక్కువే. అలాగే అణు శాస్త్ర ప్రయోగాలగురించి. ప్రభుత్వ విధానాల గురించి.

విమానాలు, బ్యాంక్‌లూ, టెలిఫోన్లూ ఎన్నోకంపెనీల ద్వారా జరగటం వల్ల, వాళ్ళల్లో వాళ్ళు పోటీపడి వినిమయదారులకి చాల చౌకగా ఇస్తారు. అలాగే ప్రజలద్వారా నడపబడే కన్స్యూమర్ గ్రూపులు ఎక్కడ నాణ్యత లోపించినా ఖరీదులు ఎక్కువ చేసినా రాచిరంపాన పెడుతుంటాయి. అంతేకాదు ఒకే రకమైన సరుకులు తయారుచేసే కంపెనీలు పోటీపడి నాణ్యత పెంచి, ఖరీదులని తగ్గిస్తాయి.

అమెరికాలో క్రైమ్ ఎక్కువట కదా అని అడుగుతుంటారు చాలమంది. ఐన్‌స్టెయిన్ చెప్పిన సాపేక్ష సిద్ధాంతం ప్రకారం, చాల దేశాలకన్నా ఎక్కువ, మరెన్నో దేశాలకన్నా తక్కువ. ఎక్కువవటానికి కారణం తుపాకుల వాడకం సులభం కావటం కావచ్చు. తక్కువవటానికి కారణం, ఈ దేశ న్యాయస్థానాలు, న్యాయ సూత్రాలు, పోలీసుల నిరంతర కృషి, వారికి సామాన్య ప్రజలు అందించే సహాయం అయివుండవచ్చు. సమాజం "వయొలెంట్" సమాజం కాదు.

సామాన్య ప్రజలలో ఇంకొకరికి సహాయం చేయాలనే తపన, ఉత్సాహం కనపడుతుంది. రకరకాల సంస్థలు ఎన్నో విధాలుగా మానవ సేవచేస్తుంటాయి. ప్రతి సంవత్సరం నేనూ మా ఆవిడా, అమెరికన్ కాన్సర్ సొసైటీ, అమెరికన్ హార్ట్ అసోషియేషన్ నిర్వహించే ఆరు మైళ్ళ నడకలో పాల్గొని, వాళ్ళకి యథాశక్తి ధన సహాయం చేస్తుంటాం. కనీసం రెండు వేల మంది నడుస్తారు. ఆ డబ్బుని కాన్సర్, హార్ట్ సంబంధమైన రీసెర్చికి ఉపయోగిస్తారు. ఇలాగే "గుడ్‌విల్" అనీ, "సాల్వేషన్ ఆర్మీ" అనీ కొన్ని సంస్థలు, అక్కడక్కడా పెట్టే కొన్ని పికప్ సెంటర్లలో, చాలమంది తమకెక్కువైన బట్టలూ వస్తువులూ చందాలూ బీదవారికి పంచటానికి ఇస్తుంటారు. వీళ్ళని చూసి కొందమంది మనవాళ్ళుకూడా ఇండియాలోని బీదవాళ్ళకి సహాయం చేసే సంస్థలు అమెరికాలో ప్రారంభించారు. మా వూళ్ళో కొంతమంది భారతీయులు, ప్రతి ఆదివారం పిల్లలతో సహా వెళ్ళి బీదవారికి ఉచిత సాండ్‌విచెస్ అందించి వస్తుంటారు. ఇథియోపియా రువాండాలాటి బీదదేశాలకి సహాయం అందిస్తుంటారు.

అమెరికన్లు చాలమంది స్నేహంగా వుంటారు. మొదటిసారి కలిసినప్పుడే పేరుతో పిలవటం చనువుగా మాట్లాడటం చేస్తుంటారు. ఎంత చనువుగావున్నా వారి స్వంత విషయాలలోకి మాత్రం ఎవర్నీ రానియరు. అలాగే ఇంకొకళ్ళ స్వంత విషయాల జోలికి పోరు. మనం పక్కింటికి వెళ్ళి ఏదన్నా చెప్పాలంటే, బయటే తలుపు దగ్గర నుంచోపెట్టి మాట్లాడుతుంటారు. వాళ్ళు మనల్ని వాళ్ళింటికి ఆహ్వానిస్తేనే, మనం లోపలికి వెళ్ళటం.

వారం రోజుల్లోనూ అందరికీ నచ్చనిది సోమవారం. అందరికీ ఇష్టమైనది శుక్రవారం. ఈ ఐదు రోజుల్లోనూ ఎంతో కష్టపడి, నలభైనించీ అరవై గంటలదాకా పనిచేసి, శనాదివారాల కోసం ఎదురుచూస్తుంటారు. బోటింగ్, స్విమ్మింగ్, సర్ఫింగ్, బైకింగ్, హైకింగ్‌లాటి దేదో ఒకటి చేస్తుంటారు. పిల్లలతో పార్కులకి సర్కస్‌లకి వెడుతుంటారు. కొంతమంది ఇళ్ళల్లో గోడలకి పైంట్ చేసుకోవటం, ఫెన్స్ బిగించుకోవటం లాటపనిలాటి ఏవో చేస్తుంటారు. మా జేమీ ఎప్పుడూ వాళ్ళ తాతగారింటికి వెళ్ళి కిచెన్ కౌంటర్ చేశాననీ, రూఫ్ బాగుచేశాననీ చెబుతుంటాడు.

ఆదివారం చర్చికి వెళ్ళేవాళ్ళూ ఎక్కువే. మన మతం గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో ప్రశ్నలడిగేవారు కొందరయితే, వాళ్ళ మతంలో చేరమని వెంటపడేవారు కొందరు.

అమెరికాలో విడాకులు ఎక్కువటకదా అని ఇంకొక ప్రశ్న. ఇక్కడ వ్యక్తి స్వాతంత్రం ఎక్కువ. ఆ స్వాతంత్రంతోపాటూ, ఆర్థిక స్వాతంత్రం కూడా ఎక్కువ. ఆ రెండూ కలిస్తే, వివాహ సమస్యలున్నవారికి విడాకులివ్వటానికి తెగువ వస్తుంది. అంటే వివాహం పాడవకుండా అసలు ప్రయత్నం చేయరా అంటే ఎందుకు చేయరు. విడాకులివ్వటం అటు భార్యాభర్తలకే కాక, ఇటు పిల్లలకీ కష్టం మరి.

మరి పెళ్ళి కాకుండానే కలిసి వుండటం? దాదాపు ముప్ఫై ఏళ్ళ నించీ ఇది ఎక్కువవుతున్నది. బాధ్యతలకి దూరంగా వుండాలనుకోవటం, అసలు పెళ్ళి మీద నమ్మకం లేకపోవటం, పెళ్ళి చేసుకోవటానికి ధైర్యం లేకపోవటంలాటి కారణాలు వుండవచ్చు. కానీ ఈనాడిది సమాజంలో అంగీకరించినదే.

ఇక్కడింకో విషయం చెప్పాలి. అమెరికాలోకూడా అన్నిదేశాల్లోలాగానే మనిషి సమాజంలో భాగమే. ఆ సమాజ నిర్మాణంలో బాధ్యత తెలిసిన మనిషి ముఖ్య పాత్ర తీసుకుంటాడు కూడాను. కానీ అదే మనిషి సమాజానికి అన్ని విధాలా తల వంచడు. అది దేశ సహజం కాదు, మానవ సహజం అని నా ఉద్దేశ్యం.

అమెరికా భూతల స్వర్గం కాదు. అలాగే ఇతర దేశాల పాలిటి భూతమూ కాదు. అది మనం ఎటునించీ చూస్తున్నామన్న దాన్నిబట్టి వుంటుంది.

అమెరికా ఎంతోమంది ప్రజలు నిర్విరామంగా కష్టపడి నిర్మించుకున్న దేశం. ఇది ఆర్థికంగా ఒక్కరోజులో ఇలా అవలేదు. రెండువందల యాభై ఏళ్ళుగా అవకాశాలని వెతుక్కొని, ఉపయోగించుకుని దేశంతో పాటూ సాంకేతికంగానూ, పారిశ్రామికంగానూ ముందుకి వెడుతున్నారు. సంపన్నమవుతున్నారు అమెరికన్లు. అమెరికాలో నివసించే విదేశీయులు.

అది వాళ్ళ తెలివితేటలకీ, పనితనానికీ, కష్టపడి పనిచేయటానికీ దక్కిన ఫలితం।

పని చేయటం తెలియటానికీ పనిచేయటానికీవున్న తేడాకూడా అదేనేమో।

* * *